క్లుప్తంగా

ఏపీ ఫార్మా సేల్స్ మేనేజర్ అసోసియేషన్ ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గసభ్యులు

కర్నూలు(హాస్పిటల్): ఆంధ్రప్రదేశ్ ఫార్మా సేల్స్ మేనేజర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఆదివారం స్థానిక గాంధీనగర్‌లోని ఆ సంఘం కార్యాలయంలో జాతీయ ఉపాధ్యక్షుడు జి. రామయ్య ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. జాతీయ ఫార్మాకంపెనీల విషయం, కార్మికుల హక్కుల గురించి సమావేశంలో ప్రస్తావించారు. ఈ సందర్భంగా 2024 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా బండారు దస్తగిరి యాదవ్, వైస్ ప్రెసిడెంట్‌గా రవికిరణ్‌కుమార్, సెక్రటరీగా కె. రామకృష్ణ, జాయింట్ సెక్రటరీగా వై. రామాంజులు రెడ్డి, ట్రెజరర్‌గా శ్రీరామ్‌పుల్లయ్య, జాయింట్ సెక్రటరీగా నాగరాజశేఖర్ ఎన్నికయ్యారు.

ఇస్కాన్‌లో భగవద్గీత తరగతులు



ప్రత్యేక అలంకరణలో జగన్నాథ్, బలదేవ్, సుభద్ర దేవతా మూర్తులు

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో ఆదివారం భగవద్గీత తరగతులు నిర్వహించారు. శీల ప్రభుపాదుల ప్రేమ విందు నిర్వహించారు. ఇస్కాన్ బాధ్యులు రఘునందన్ సేవక్ ప్రభు భగవద్గీతపై ప్రవచనం చెప్పారు. మానవ సంబంధాలు, ఉన్నత జీవనం సాగించేందుకు ఉపయోగ పడే అన్ని అంశాలు భగవద్గీతలో ఉన్నాయన్నారు. గీత పఠనం, శ్రవణంతో జీవన యానంలో మార్పు వస్తుందన్నారు. అనంతరం హరే రామ హరే కృష్ణ నామ సంకీర్తన చేశారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే అవసరం



బెల్టు గ్రేడింగ్‌లు అందజేస్తున్న గౌస్‌దేశాయ్

కర్నూలు(సెంట్రల్): ఆత్మరక్షణకు కరాటే అవసరమని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ అన్నారు. ఆదివారం జొహరాపురంలోని షరీక్ నగర్‌లో సుందరయ్య స్ఫూర్తి కేంద్రం, యూనివర్సల్ బూడోకాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు బెల్ట్‌గ్రేడింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు బెల్టులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో శిక్షకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

సీఏఏ అమలుకు వ్యతిరేకం



మీర్జా అబ్దుల్లా బేగ్

కర్నూలు(సెంట్రల్): కేంద్ర ప్రభుత్వం తెచ్చిన పౌర సవరణ చట్టం సీఏఏ అమలునకు ఎస్‌డీపీఐ వ్యతిరేకమని ఆపార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మీర్జా అబ్దుల్లా బేగ్ ప్రకటించారు. ఆదివారం ఆయన పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ..సీఏఏ అమలుపై టీడీపీ తన వైఖరి చెప్పాలన్నారు. బీజేపీతో పొత్తుక ట్టిన చంద్రబాబుకు ముస్లింలు ఓటర్లు అవసరం లేదా అని ప్రశ్నించారు. బీజేపీతో జతకట్టిన పార్టీలను ఎన్నికల్లో ఓడించి ఇంటికి పంపాలని ఆయన పిలుపునిచ్చారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

కర్నూలు: రైలు కింద పడి గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందాడు. కర్నూలు – అలంపూర్ రైల్వే స్టేషన్ల మధ్య తుంగభద్ర బ్రిడ్జిపై ఆదివారం మధ్యాహ్నం సమయంలో ఈ ప్రమాదం జరిగింది. కర్నూలు స్టేషన్ సూపరింటెండెంట్ కె. నాగరాజు ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మరణించిన వ్యక్తి సుమారు 30 ఏళ్ల వయస్సు కలిగి ఉన్నాడు. కుడివైపు నడుము వద్ద నల్లటి పుట్టుమచ్చ, బ్లూ కలర్ చెక్స్ షర్ట్, బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్ ధరించాడు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు సెల్: 9441970940కు సమాచారం ఇవ్వాలని రైల్వే పోలీసు స్టేషన్ హౌస్ ఆఫీసర్ కోదండరాముడు తెలిపాడు.

స్పందన రద్దు

కర్నూలు (టౌన్) : సార్వత్రిక ఎన్నికల కోడ్ శనివారం నుంచి అమలులోకి రావడంతో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

కృష్ణగిరి: స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయంలో 6వ తరగతి, ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ చైతన్య స్రవంతి తెలిపారు. 6వ తరగతిలో 40, ఇంటర్ బైపీసీలో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయని వెల్లడించారు.

అండగా నిలబడండి





ఇంతియాజ్ సమక్షంలో పార్టీలో చేరిన పాతబస్తీ యువకులు, కుబ్‌సూరత్ మసీదులో ప్రత్యేక ప్రార్థన చేస్తున్న ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి

పేదవాడి సంక్షేమం వైఎస్‌ఆర్‌సీపీతోనే సాధ్యం

- కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్
- మాజీ ఎమ్మెల్యే ఎస్వీతో కలిసి పాతబస్తీలో ప్రచారం

కర్నూలు (టౌన్): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వానికి ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ అండగా నిలబడాలని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ ప్రజలను విజ్ఞప్తి చేశారు. ఆదివారం రాత్రి మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డితో కలిసి పాతబస్తీ పరిధిలోని కేవీఆర్ గార్డెన్ నుంచి ఎన్నికల ప్రచారం చేపట్టారు. రోడుసైడ్ చిరు వ్యాపారులను కలిసి జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. చిరువ్యాపారుల కుటుంబాలకు జరిగిన మేలును గుర్తుచేశారు. ఆర్థికంగా మరింత అభివృద్ధి సాధించాలంటే వచ్చే ఎన్నికల్లో జగనన్నను మళ్లీ గెలిపించుకోవాలన్నారు. వైఎస్‌ఆర్‌సీపీ మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమన్నారు. గతంలో మాదిరిగానే ఈసారి కూడా నగర ప్రజలు వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీకి అండగా ఉండాలని కోరారు. ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి నగరాభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

కుబ్‌సూరత్ మసీదులో...

పాతబస్తీలోని కుబ్‌సూరత్ మసీదులో వైఎస్ఆర్‌సీపీ కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ముస్లిం మత పెద్దలతో కలిసి దువా చేశారు.

వైఎస్‌ఆర్‌సీపీలో చేరిక

జగనన్న సంక్షేమ పాలన చూసి అనేక మంది వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీలో చేరుతున్నారని ఇంతియాజ్ అన్నారు. ఆదివారం పాతబస్తీకి చెందిన యువకులు పెద్ద సంఖ్యలో పార్టీలో చేరారు. పార్టీ నగర కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వారందరికీ ఆయన పార్టీ కండువాలు కప్పారు. అనంతరం ఇంతియాజ్ మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో అన్ని వర్గాల సంక్షేమానికి జగనన్న ప్రభుత్వం కృషి చేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలన్నారు.

కవిత్వం రాయడం కళ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీ వేత్తలు

కర్నూలు కల్చరల్: కవిత్వం రాయడం ఓ కళ అని, ఇది మనిషిని చైతన్య వంతునిగా తీర్చిదిద్ది సమాజాన్ని ప్రగతి పథం వైపు నడిపిస్తుందని హైదరాబాద్ సిటీ కాలేజ్ తెలుగు శాఖాధిపతి ప్రముఖ రచయిత డాక్టర్ కోయికోటేశ్వరరావు అన్నారు. సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో నాగలి కూడా ఆయుధమే పుస్తక పరిచయ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొమ్మవరపు విల్సన్ రావు కవిత్వంలో సామాజిక అంశాలు ఉంటాయన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం గ్రహీత తగుళ్ల గోపాల్ మాట్లాడుతూ నాగలి కూడా ఆయుధమే పుస్తకంలో సామాన్యుని బతుకు చిత్రం కనబడుతుందన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ మాట్లాడారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. కార్యక్రమంలో సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆవుల బసప్ప, ఆవుల చక్రపాణి యాదవ్, నాయకులు విజయులు, తనగల కవులు వెంకటేష్, మారుతి, అరుణ, వెంకటేశ్వర్లు, ఏపీ రెడ్డి, విశ్వనాథ రెడ్డి, డాక్టర్ హరికిషన్ తదితరులు పాల్గొన్నారు.

దేవతలారా రారండి..

- నకల దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజపటావిష్కరణ
- సింహవాహనంపై ఊరేగిన ప్రహ్లాదవరదుడు
- సూర్యప్రభ వాహనంపై దర్శనమిచ్చిన జ్వాలా నరసింహుడు



ప్రత్యేకాలంకరణలో ఉభయ దేవేరులతో కొలువైన ప్రహ్లాదవరదుడు



శాస్త్రోక్తంగా ధ్వజపటావిష్కరణ చేస్తున్న అర్చకులు

ఆళ్లగడ్డ: అహోబిలేశుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం దిగువ అహోబిలంలో ధ్వజారోహణ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం అహోబిల మఠం పీఠాధిపతి శ్రీరంగరాజ యతీంద్ర మహాదేశికన్ ఆధ్వర్యంలో ధ్వజారోహణ పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు సకల దేవతామూర్తులను ఆహ్వానిస్తూ ధ్వజ స్తంభంపై గరుత్మంతుని చిత్రపటావిష్కరణ చేశారు. అంతకు ముందు దిగువ అహోబిలం దేవాలయం ఆవరణ నుంచి ప్రత్యేకంగా అలంకరించిన గరుత్మంతుని చిత్రపటాన్ని పల్లకీలో కొలువుంచి ప్రదక్షిణ చేయిస్తూ ఊరేగింపుగా ఆలయం ఎదురుగా ఉన్న ధ్వజ స్తంభం వద్దకు తీసుకువచ్చారు. అలాగే ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరద స్వాములతో పాటు మొదటి జియర్ శ్రీ ఆదివన్ షటగోపన్ ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో తీసుకొచ్చారు. అక్కడ శ్రీ ప్రహ్లాదవరదుని బ్రహ్మోత్సవాలకు సకల దేవతామూర్తులు తరలిరావాలని ఆహ్వానిస్తూ ధ్వజారోహణం చేసి మంత్ర పూర్వకంగా పిలుపునిచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రధాన ఘట్టమైన ప్రహ్లాదవరదుడి కల్యాణ మహోత్సవం ఈనెల 23వ తేదీన జరగనుంది. ఈ మహోత్సవానికి ముక్కోటి దేవతలు కదలి వచ్చి, విందారగించి స్వామి అమ్మవార్లను ఆశీర్వదిస్తారని తద్వార లోక కల్యాణం నిర్వహించినట్లు అవుతుందని పురాణాలు చెబుతున్నాయి. ఈ సందర్భంగా భేరీ పూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తుల దర్శనార్థం కొలువుంచారు. రాత్రి ప్రహ్లాదవరదుడు సింహ వాహనంపై కొలువై మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తజనులను అనుగ్రహించారు. పూజల్లో ప్రధానార్చకులు వేణుగోపాలన్, మణియార్ సామ్యానారాయన్, జీపీఏ సంపత్, ఓఎస్‌డి శివప్రసాద్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఎగువ అహోబిలంలో..

అహోబిల బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోవ రోజు ఆదివారం ఎగువ అహోబిలంలో శ్రీ జ్వాలా నరసింహ స్వామికి రెండు వాహన సేవలు నిర్వహించారు. ముందుగా హంస వాహనంపై కొలువైన స్వామి వారు మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. రాత్రి సూర్యప్రభ వాహనంపై జ్వాలా నరసింహుడు విహరించారు. ముందుగా నిత్య పూజలు అనంతరం ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ జ్వాల నరసింహులను యాగశాలలో కొలువుంచి పట్టువస్త్రాలతో అలంకరించారు.

టీడీపీ, జనసేనలను ఓడించండి

కర్నూలు(సెంట్రల్): మతోన్మాద బీజేపీతో అంటకాగుతున్న టీడీపీ, జనసేన అభ్యర్థులను ఎన్నికల్లో ఓడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ పిలుపునిచ్చారు. ఆదివారం 48వ వార్డు పరిధిలోని అమీర్ హైదర్ ఖాన్ నగర్ శాఖ జనరల్ బాడీ సమావేశం ఓల్డ్‌సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలన్నీ బీజేపీకి అండగా ఉన్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్, కమ్యూనిస్టులు ఉండే ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. సీఏఏ చట్టం అమలుపై చంద్రబాబునాయుడు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ కూటమికి దారుణమైన ఓటమి తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ పి.నిర్మల పాల్గొన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

కృష్ణగిరి: పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని లాల్‌మాన్‌పల్లెకు చెందిన అల్లాబకాష్ (42), హలిమా దంపతులకు ఇద్దరు కుమార్తెలు సంతానం. వీరు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 14న అల్లాబకాష్ మామిడి చెట్లకు పూత రాలకుండా మందు స్ప్రే చేసి వస్తానని ఇంటి నుంచి బయలుదేరి వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో పడిఉండటాన్ని గుర్తించిన రైతులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు వెంటనే డోన్ ఆస్పత్రికి అక్కడి నుంచి కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించగా కోలుకోలేక ఆదివారం అల్లాబకాష్ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. కుమార్తె వివాహం, వ్యవసాయం కోసం చేసిన అప్పులు తీర్చలేమనే మనస్తాపంతో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు భార్య హలిమా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

హత్యకేసులో ముమ్మర విచారణ

- మరో ఇద్దరు అనుమానితులను విచారిస్తున్న పోలీసులు

గోనెగండ్ల: మండల పరిధిలోని పెద్దమరివీడు గ్రామంలో కురువ నాగమ్మను ఆమె మనుమడు వెంకటేష్ గొంతు నులిమి చంపి ఆమె బంగారుతో సెల్‌ఫోన్ కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. వెంకటేష్ ఒక్కడే నానామ్మను హత్య చేసి ఇంటి ఆవరణలో గుంత తవ్వి పూడ్చడం సాధ్యమయ్యే పనేనా అనే అనుమానాలు గ్రామంలో వ్యక్తమవుతున్నాయి. వెంకటేష్‌తో పాటు గ్రామంలో మరో ఇద్దరు యువకులపై అనుమానం రావడంతో వారిని పోలీసులు ఆదివారం విచారణ చేసినట్లు తెలిసింది. ఈ విషయంపై సీఐ రామకృష్ణయ్యను వివరణ కోరగా అనుమానంతోనే ఇద్దరు యువకులను విచారిస్తున్నామని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

మరోసారి వైఎస్‌ఆర్‌సీపీ జెండా ఎగరేద్దాం





వీకర్ సెక్షన్ కాలనీలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, టీడీపీ శ్రేణులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: మే 13వ తేదీన జరగనున్న ఎన్నికల్లో పాణ్యం నియోజకవర్గంలో మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేద్దామని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, యువనేత కాటసాని శివనరసింహారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కల్లూరు అర్బన్ 37వ వార్డు వీకర్ సెక్షన్ కాలనీలో కార్పొరేటర్ అయిషా సిద్దిఖా, స్థానిక నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ పాలనలో ఏదైనా సంక్షేమ పథకం లబ్ధి చేకురాలంటే జన్మభూమి కమిటీల సిఫారసుతో పాటు నాయకులు అండదండలు అవసరమయ్యేవని గుర్తు చేశారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కులమతాలు, రాజకీయాలు, వర్గాలు, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. పథకాల లబ్ధిలో ఎలాంటి అవినీతికి అస్కారం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలో నగదు జమ చేస్తున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకుని మరింత సంక్షేమాభివృద్ధి సాధిద్దామన్నారు. అధికారం కోసం ప్రతిపక్షాలు చేస్తున్న అసత్యాలు, మోసపూరిత మాటలను నమ్మి మోసపోవదని ప్రజలకు సూచించారు. 2014 ఎన్నికల్లో టీడీపీ నాయకడు చంద్రబాబు 600 పైగా హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక మోసం చేసిన సంగతిని గుర్తు చేశారు.

వైఎస్‌ఆర్‌సీపీలో చేరిక

కల్లూరు: కల్లూరు అర్బన్ 31వ వార్డుకు చెందిన సుమారు 100 కుటుంబాలు ఆదివారం రాత్రి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. స్థానిక కార్పొరేటర్ మిద్దె చిట్టెమ్మ ఆధ్వర్యంలో 31వ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ కృష్ణతో పాటు కేశవ్, లాజర్, మద్దిలేటి, విజయ్, నరసింహుడు తదితరులకు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, యువనేత కాటసాని శివనరసింహారెడ్డి పార్టీ కండువా వేసి వైఎస్‌ఆర్‌సీపీలోకి ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకు టీడీపీ అందించిన పాలనకు, 2019 నుంచి ఇప్పటి వరకు వైఎస్ జగన్ అందించిన పాలనలో తేడాను గమనించాలన్నారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు పొదుపు రుణాలను మాఫీ చేస్తానని హామీ ఇచ్చి మోసం చేశారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం పొదుపు రుణాలను మాఫీ చేశారన్నారు. అంతేకాకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన 45 ఏళ్ల నుంచి 60 ఏళ్లలోపు మహిళలకు వైఎస్సార్ చేయూత కింద ఏడాదికి రూ. 18,750 ఆర్థిక సహాయం అందజేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్‌ఆర్‌సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, లక్ష్మీరెడ్డి, నాయకులు తిరుపాలు, పెద్దన్న, శివారెడ్డి పాల్గొన్నారు.

సింహ వాహనంపై విహరించిన శ్రీరంగనాథుడు



సింహ వాహన సేవ నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: నగర శివారులోని గోదా గోకులంలో వెలసిన శ్రీగోదా దేవి సమేత రంగనాథ స్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు ఆదివారం స్వామివారికి సింహ వాహన సేవ నిర్వహించారు. తిరుమాడ వీధుల్లో స్వామివారు విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తుల సకల సౌభాగ్యం కోసం 1008 మంది దంపతులకు పీఠాధిపతులు అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి అష్టాక్షరీ బృందావన రామానుజ జీయర్ స్వామిలు తాంబూలం ప్రదానం చేశారు. శ్రీమన్నారాయణాచార్య స్వామి యాజ్ఞికత్వంలో అర్చకులు రమేష్ భట్టర్, కిరణ్ భట్టర్ బృందం పూజా క్రతవు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రయాగ్ రాజ్ రాఘవ ప్రసన్న జీయర్ స్వామి, పరమాత్మ నందగిరి స్వామి, గోదా గోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజు గుప్త, ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, సభ్యులు పాలాది సుబ్రహ్మణ్యం, బాల సుధాకర్, భూమా కృష్ణమోహన్, వేముల జనార్దన్, తల్లం సురేష్, తలుపుల శ్రీనాథ్, వెంకట సుబ్రహ్మణ్యంతో పాటు గోదాగోకులం పరివారం పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం

కర్నూలు: ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా కేంద్ర సాయుధ బలగాలతో కలిసి జిల్లాలోని పలు ప్రాంతాల్లో పోలీసులు కవాతు నిర్వహిస్తున్నారని జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్ తెలిపారు. ఆదివారం కర్నూలులో జరిగిన కవాతు సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకు పోలీసులు కవాతు నిర్వహిస్తున్నారన్నారు. ఓటర్లు స్వచ్ఛగా నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని చెప్పారు.

ఫ్లై ఓవర్ వంతెనలతోనే ప్రమాదాలు

కర్నూలు(సెంట్రల్) : నగరంలోని బాలాజీనగర్, సంతోష్ నగర్‌లలో అశాస్త్రీయంగా నిర్మించిన ఫ్లైఓ వర్ బ్రిడ్జిలతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా యని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర సభ్యుడు ఈ.పుల్లారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కేకే భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఫ్లై ఓవర్లకు అనుసంధానంగా సర్వీసు రోడ్లు, ఫుట్ ఓవర్ వంతెనలను నిర్మించాలన్నారు. అప్పుడే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు.

బురాన్‌దొడ్డి కుంటకు చేరిన ఎల్ఎల్‌సీ నీరు



బురాన్‌దొడ్డి కుళాయిల కుంటకు చేరిన మంచినీటిని పరిశీలిస్తున్న గ్రామ పెద్దలు

సి.బెళగల్: ఎల్ఎల్‌సీ నీరు ఆదివారం బురాన్‌దొడ్డి కుంటకు చేరింది. మండలంలోని బురాన్‌దొడ్డి గ్రామ ప్రజల మంచినీటి సమస్యను నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు పరిష్కరించారు. గ్రామంలో ఐదు రోజులపాటు సాగే ఉరుసు ఉత్సవాలు ఉండటంతో గ్రామస్తులకు మంచినీటి సమస్యను గ్రామ పెద్దలు రాజశేఖర్ రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, చంద్ర, గోపాల తదితరులు కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, కోడుమూరు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్‌ల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన నేతలు ఇరిగేషన్ అధికారులతో చర్చించి గ్రామానికి ఎల్ఎల్‌సీ ద్వారా రోజు 12 క్యూసెక్కుల మేర ఐదు రోజుల పాటు మంచినీటి అందించేలా చర్యలు తీసుకున్నారు. దీనితో 15వ తేదీ విడుదల అయిన నీరు ఆదివారం గ్రామంలోని కుళాయి చెక్కు డ్యాము కుంటలకు చేరుకుంది. గ్రామ పెద్దలు దుబ్బద సుంకన్న, రామాంజినేయులు, తిరుపతయ్య, నరసింహుడు, నాయుడు నీటిని పరిశీలించారు. కుడా చైర్మన్, డాక్టర్ సతీష్‌లను రుణపడి ఉంటామని, ఎల్ఎల్‌సీ డీఈ లక్ష్మణ్‌కుమార్, ఏఈ ఉదయ్ భాస్కర్, వర్క్ఇన్‌స్పెక్టర్ అర్జుడు తదితరులకు ధన్యవాదాలు తెలిపారు.

సీట్ల కేటాయింపులో సామాజిక న్యాయం

కర్నూలు(అర్బన్): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన సీట్ల కేటాయింపులో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందరికి నచ్చే విధంగా సామాజిక న్యాయం పాటించారని ఏపీ ముస్లిం కౌన్సిల్ అధ్యక్షుడు సయ్యద్ రోషన్ ఆలీ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీన విడుదల చేసిన అభ్యర్థుల జాబితాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు సమన్యాయం చేశారన్నారు. ఈ జాబితాను ఏపీ ముస్లిం కౌన్సిల్ మనస్పూర్తిగా ఆహ్వానిస్తోందన్నారు. దివంగత ముఖ్యమంత్రి డా.వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించిన విధంగా ప్రస్తుత ఎన్నికల్లో వైఎస్ జగన్ ఏడుగురు ముస్లింలను ఎమ్మెల్యే అభ్యర్థులుగా ప్రకటించారన్నారు. భవిష్యత్తులో కూడా సంక్షేమం, అభివృద్ధి జరగాలంటే ఇలాంటి డేర్ అండ్ డైనమిక్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావాల్సిన చారిత్రక ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. గతంలో ఏ రాజకీయ పార్టీ కూడా ఇంత ధైర్యంగా అణగారిన వర్గాలను రాజకీయ పదవుల్లో భాగస్వామ్యం చేయలేదన్నారు.

21 నుంచి రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన రంగనాథుడి బ్రహ్మోత్సవాలు ఈ నెల 21వ తేదీ నుంచి 30వ తేదీ వరకు పది రోజుల పాటు వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ ఈడిగ దస్తగిరి గౌడ్ తెలిపారు. 21న ధ్వజారోహణం, 22న సింహోత్సవం, 23న శేషోత్సవం, 24న లంకోత్సవం, 25న గరుడోత్సవం, 26న గజోత్సవం, 27న తెల్లవారుజామున చిత్తానక్షత్రంలో స్వామి వారి కల్యాణోత్సవం, అదే రోజు ఉదయం 10 గంటలకు రథాంగ హోమం, బ్రహ్మరథం, సాయంత్రం అశేష జనవాహిని మధ్య రథోత్సవం నిర్వహించనున్నారు. 28న అశ్వవాహనం, 29న ఉదయం పూర్ణాహుతి, వసంతోత్సవం, రాత్రి హంసవాహన సేవ, 30న ద్వాదశ ప్రదక్షిణోత్సవాలు, రాత్రి పాన్పు సేవ ఉంటాయన్నారు. భక్తులు బ్రహోత్సవాలలో విరివిగా పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఎన్నికల సంఘం మార్గదర్శకాలు పాటించాలి

- రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ




రాయలసీమ యూనివర్సిటీ క్యాంపస్‌లో స్ట్రాంగ్ రూమ్‌ల గురించి ఆరా తీస్తున్న రిటర్నింగ్ అధికారి


కర్నూలు (టౌన్) : కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన మార్గదర్శకాలను అన్ని రాజకీయ పార్టీలు తప్పని సరిగా పాటించాలని 137 కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ అన్నారు.ఆదివారం స్థానిక నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులో వివిధ రాజకీయ పార్టీల అధికారిక ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున నియోజకవర్గ పరిధిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉందన్నారు. కాన్వాసింగ్, ప్రచార వాహనాలు, లౌడ్ స్పీకర్, తాత్కాలిక పార్టీ కార్యాలయాన్ని నిర్వహించడం, స్ట్రీట్ కార్నర్ మీటింగ్, ఊరేగింపు, ర్యాలీ, పోస్టర్, హోర్డింగ్, బ్యానర్ జెండాలను ప్రదర్శించడం తదితర వాటికి అనుమతి తప్పనిసరి అన్నారు. అనుమతి లేని పోస్టర్లు, బ్యానర్లు వంటి ప్రచార సాధనాలను తొలగిస్తామని చెప్పారు. అన్ని రాజకీయ పార్టీలు, ఇండిపెండెంట్ అభ్యర్థులు ఖచ్చితంగా అనుమతులు పొందిన ప్రచార సాధనాలనే ఉపయోగించాలన్నారు. ఇప్పటికే నగరంలోని రాజకీయ నాయకుల విగ్రహాలను కప్పి వేశామని, అన్ని రాజకీయ పార్టీలకు సంబంధించిన బ్యానర్లు తొలగించామన్నారు. సమావేశంలో నగరపాలక అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, కర్నూలు అర్బన్ తహసీల్దార్ మోహన్‌కుమార్, టౌన్ ప్లానింగ్ డీసీపీ సంధ్య, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నోడల్ అధికారి రంగస్వామి పాల్గొన్నారు. అంతకు ముందు రిటర్నింగ్ అధికారి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, స్టాటిక్ సర్వైలెన్స్, ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్‌ల విధి విధానాలపై సమావేశం నిర్వహించారు. సమావేశంలో అదనపు కమిషనర్, నోడల్ ఆధికారులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూముల వద్ద పనులు త్వరితగతిన పూర్తి చేయండి


ఎన్నికలకు సంబంధించిన స్ట్రాంగ్ రూముల వద్ద పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ స్పష్టం చేశారు. ఆదివారం రాయలసీమ యూనివర్సిటీ క్యాంపస్‌లో ఉన్న స్ట్రాంగ్ రూమ్‌లను నగరపాలక, టిడ్కో ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. సదుపాయాల కల్పనకు తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు.



సీ క్యాంప్ సెంటర్‌లో..



కలెక్టరేట్ ఎదుట..



వైఎస్‌ఆర్ సర్కిల్‌లో..

మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలుకు అధికారులు చర్యలు చేపట్టారు. నిబంధనల్లో భాగంగా వివిధ రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేస్తున్నారు. కర్నూలు నగరంలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఎన్‌టీఆర్, వైఎస్‌ఆర్, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి విగ్రహాలకు ఆదివారం గుడ్డ చుట్టిన దృశ్యాలు. –సాక్షి, ఫొటోగ్రాఫర్, కర్నూలు